# మెట్రో హీరో ఎన్వీఎస్ రెడ్డి

## హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అంతరంగం





తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో రైళ్ల రాకపోకల్ని పెంచడానికి.. మీటర్ గేజిని బ్రాడ్‌గేజిగా మార్చడానికి పక్కా ఆర్థిక ప్రణాళికల్ని నిర్వహించారు. కొంకణ్ రైల్వేను పట్టాలపైకెక్కించిన ముగ్గురు కీలక సభ్యుల్లో ఒకరు.. హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్‌ను లాభాల బాటలో నడిపించారు. ఫ్లైఓవర్లు, ఉద్యానవనాలు, ప్రజా అవసరాలు.. ఇలా ఆయన చేపట్టిన కార్యక్రమాలన్నీ వినూత్నమైనవే. పని ఏదైనా పక్కాగా చేపడతారని, సమర్థంగా పూర్తి చేస్తారని ఆయనకు పేరుంది. హైదరాబాద్ మెట్రో రైలు కూత నగరంలో విన్పించదనే పరిస్థితుల నుంచి విజయవంతంగా దానిని పట్టాలపైకెక్కించడంలో విజయం సాధించారు.. హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి. మరి ఆయన అంతరంగంలోకి వెళితే....

ఆస్తి ప్రతినిధి, హైదరాబాద్

నా స్వగ్రామం.. తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలంలోని కుతుకలూరు. మాది వ్యవసాయ కుటుంబం. మొత్తం నలుగురు పిల్లలం. నేనే అందరి కంటే పెద్దవాడ్ని. మా అమ్మ చదువుకుంది తక్కువే అయినా లోకజ్ఞానం ఎక్కువ. తను బ్రిటీష్ చరిత్ర చెప్పేది. బ్రిటీష్ వారు మన దేశాన్ని ఎలా ఆక్రమించుకుందో వివరించేది. అంతే కాదు, జీవిత పాఠాల్ని నేర్పేది. అయితే వాటిని నేనెక్కువగా వినేవాడ్ని కాదు. కానీ, ఇప్పుడా విషయాన్ని తలుచుకుంటే, మా అమ్మ గొప్పతనమేమిటో అర్థమవుతుంది. అప్పట్లో మా తాతయ్య తరుచూ ఒక మాట అనేవారు. కాటన్ దొర రాకపోయి ఉంటే.. ఏటా కరవు లేదా వరదలతో తల్లడిల్లేవారమని చెప్పడం నాకింకా గుర్తు.

'నేను చదువుల్లో ఎప్పుడూ ఫస్టే. స్టార్ టీవీలు, ఇంటర్నెట్‌లు, సెల్‌ఫోనులు వచ్చాయి కానీ విజ్ఞానాన్ని పెంచుకోవడానికి పుస్తకాలే ఆధారం. నా అదృష్టం ఏమిటంటే.. పుస్తకాలు చదవడం చిన్నప్పుడే బాగా అలవాటైంది. ఏదో పుస్తకాన్ని ఎప్పుడూ చదవడం నా హాబీ.. ఆరో తరగతిలో చదివిన నీతిచంద్రిక కథలు నాలో ఆలోచనను రేకెత్తించేవి. అప్పట్లో నాకో సమస్య ఉండేది. ఆంగ్లంలో మాట్లాడటానికి ఇబ్బంది పడేవాడ్ని. ఈ కారణంగా జవహర్‌లాల్ నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకాన్ని ఇంగ్లీష్‌లో కాకుండా తెలుగులో చదివాను. ఎనిమిదో తరగతిలో ఈ పుస్తకాన్ని చదివా. మొదటి నవల.. ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన మాలపిల్ల. నవలలు, కవితలు విపరీతంగా చదివేవాడ్ని. చలం, రంగనాయకమ్మ, బుచ్చిబాబు, తిలక్, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ.. ఇలా అందరి రచనల్ని చదివేశాను.

కమ్యూనిస్ట్ భావజాలం నన్ను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీశ్రీ సాహిత్యాన్ని ఎక్కువగా చదివాను. విప్లవ సాహిత్యం ఒంటబట్టింది. ఆ స్ఫూర్తితో కవితలూ రాసేవాడ్ని. హేతువాదంపై రాసిన కవితకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రప్రథమ బహుమతి అందుకున్నాను. అదీ శ్రీశ్రీ చేతుల మీదుగా, చాలా బాగా రాశావని ఆయన పొగుడుతుంటే నా ఆనందానికి అవధుల్లేవని చెప్పొచ్చు. తిలక్ రాసిన కవితలకు ప్యారడీలు రాసేవాడ్ని.

నేను డాక్టర్ కావాలని తల్లిదండ్రులు భావించేవారు. కానీ, ప్రజలకు ఇంకా పెద్దస్థాయిలో



సేవ చేయాలనే ఆశయం నా మనసులో ఉండేది. ఇంటర్‌లో ఉండగా.. సివిల్ సర్వీసెస్ గురించి తెలిసింది. అందులో విజయం సాధించాలంటే ఆంగ్లంలో పట్టు సాధించాలని అర్థమైంది. అందుకే రాత్రివేళలో చదువు పూర్తయ్యాక బీబీసీ రేడియో వినేవాడ్ని. వింటూ నిద్రపోయేవాడ్ని. అప్పట్లో ఆంగ్లం పుస్తకాలు పెద్దగా దొరికేవి కావు. దగ్గర్లోని రామచంద్రపురంకి సైకిల్ మీద వెళ్లి పుస్తకాలు తెచ్చుకునేవాడిని.

అప్పట్లో కలెక్టర్లు లేదా ఇతర సివిల్ సర్వీస్ ఆఫీసర్లు ఎక్కువగా ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి వచ్చారని అర్థమైంది. వారు ఎక్కువగా ఎంఏ హిస్టరీ, పొలిటికల్ సైన్స్ వంటివి తీసుకుని విజయం సాధించారు. అందుకే ఇంటర్‌లో సైన్స్ చదివినా.. తర్వాత బీఏలో చేరా. ఈ విషయం ఇంట్లో వాళ్లకు తెలిసి తిట్టారు. కలెక్టర్ కావడమంటే ఆషామాషీ వ్యవహారం కాదని నచ్చచెప్పారు. కానీ, ముందు నుంచీ నేను రెబల్ అని తెలుసు. అందుకే తల్లిదండ్రులు నా ఇష్టానికే వదిలేశారు. రామచంద్రాపురంలో వీఎస్ఎం కాలేజీలో బీఏ చేరాను. డిగ్రీలో వై.వెంకట్రామయ్య లెక్చరర్ గారు ఆంగ్లంలో ప్రావీణ్యుడ్ని చేశారు. డాక్టర్ రుద్రయ్యచౌదరి లోకజ్ఞానం గల చక్కటి మేధావి. వీరి ప్రభావంతో విశాల దృక్పథాన్ని అలవర్చుకోగలిగాను. చదువుల్లో కష్టపడ్డాను. ఆంధ్రా విశ్వవిద్యాలయం టాపర్ అయ్యాను. ఇక తల్లిదండ్రుల నుంచి ఎలాంటి అభ్యంతరం వ్యక్తమయ్యేది కాదు. ఊరికి చేరువలో చిన్న ఉద్యోగమైనా చేస్తూ తమకు దగ్గరగా ఉండాలని తల్లిదండ్రులు భావించేవారు. కానీ, మన ఆలోచనలు పూర్తిగా భిన్నం కదా?

తదుపరి అడుగు. ఢిల్లీలోని జవహర్‌లాల్ యూనివర్శిటీ అని అనుకున్నాను. ఎంఏ రాజనీతి శాస్త్రంలో పీజీ సీటు దొరికింది. బీఏ టాపర్ అని మొదట్లో కొంత తలబిరుసు ఉండేది. కానీ, ఢిల్లీ, ఇతర నగరాల నుంచొచ్చిన విద్యార్థుల్ని చూసి కొంత ఇన్‌ఫీరియర్‌గా ఫీలయ్యాను. కానీ, త్వరగా నా తీరు మార్చుకున్నాను. కార్ల్‌మార్క్స్ రాసిన ఎన్నో పుస్తకాలు చదివాను. మానవాళి ఎలా మార్పు చెందుతూ వచ్చిందో ఆయనకు పక్కా అవగాహన ఉంది. ప్రపంచంలో ఎందరో తత్వవేత్తలున్నా.. సగం ప్రపంచాన్ని కమ్యూనిజం వైపు తిప్పుకోవడంలో విజయం సాధించిన ఘనత ఆయనకే సొంతం. అట్లాగే

HYDERABAD METRO RAIL



సత్యం కుంభకోణంతో మెట్రో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎక్కడ చూసినా వ్యతిరేకంగా మాట్లాడటం మొదలైంది. వ్యక్తిగతంగా బహుళ జాతి సంస్థలు, కార్పొరేట్ల నుంచి ఆకర్షణీయమైన ఆఫర్లు వచ్చాయి. ఏడాదికి కోటి రూపాయలకు పైగా జీతం ఇస్తామన్నారు. కానీ, నేను అంగీకరించలేదు. నాలుగైదేళ్ల పాటు ఎంతోమంది శ్రమించి.. ఆరంభ స్థాయికి వచ్చిన మెట్రోను అలా వదిలేయడం నాకిష్టం లేదు. పైగా నా జట్టు సభ్యులు నాపై నమ్మకంతో ఈ ప్రాజెక్టులోకి వచ్చారు. సత్యం కుంభకోణం తర్వాత డీలాపడ్డ మా జట్టుకి.. హంగెరీకి చెందిన రైఫిల్ షూటర్ కరోలి తకాక్స్ కథ చెబుతూ స్ఫూర్తినిచ్చే వాడ్ని. హంగేరీ సైనిక దళానికి చెందిన ఓ షూటర్.. ఒకరోజు చేతి బాంబు చేతిలో పేలడంతో కుడిచేయిని పోగొట్టుకుంటాడు. తర్వాత అతను ఏడాది పాటు ఎవరికీ కన్పించడు. ఆత్మహత్య చేసుకున్నాడని.. పిచ్చిపట్టిందని.. ఇలా రకరకాలుగా అనుకున్నారు. ఏడాదయ్యాక మళ్లీ దర్శనమిచ్చాడు. అతన్ని చూసి బతికే ఉన్నాడని తోటి క్రీడాకారులు, శిక్షకులు సంతోషించారు. పోటీలు చూడటానికి వచ్చినందుకు ఆనందంగా ఉందని అతనితో అంటే, అప్పుడతను వెంటనే - నేను చూడ్డానికి రాలేదు.. పోటీలో పాల్గొనడానికి వచ్చానని అనడంతో ఆశ్చర్యపోయారు. తర్వాత ఒలంపిక్స్‌లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. ఏడాది పాటు అతనేం చేశాడో తెలుసా? కుడిచేయి పోయిందని బాధపడకుండా ఎడమ చేతితో రైఫిల్ ప్రాక్టీస్ చేశాడు. మొదట్లో రైఫిల్ పట్టుకోవడమే గగనమయ్యేది. కానీ, ఏదీ అసాధ్యం కాదు. రోజుకి గంటలు గంటలు శ్రమించి.. ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధించే స్థాయికి చేరుకున్నాడు. కాబట్టి, ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా.. ధైర్యంగా నిలబడి పోరాటం చేస్తేనే విజయం దక్కుతుందని మా వాళ్లకు.. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు చెబుతుంటాను.

“ శ్రీమతి సికింద్రాబాద్‌లోని కస్తూర్బా కళాశాలలో ఆంగ్ల లెక్చరర్. ఇద్దరు మగపిల్లలు. మొదటి అబ్బాయి అమెరికాలో ఎమ్మెస్ పూర్తి చేసి.. అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. రెండో బాబు బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు.

“ వీలైనప్పుడల్లా ఐఐఎంలో మేనేజ్‌మెంట్ పాఠాలు చెబుతాను. కబీర్‌దాస్, సుమతి, వేమన శతకాల్ని ఆంగ్లంలోకి అనువాదం చేసి వినిపిస్తాను. ఐఎస్‌బీలో తరగతుల్ని తీసుకుంటాను.

“ కూరగాయలు, మొక్కల పెంపకంపై బాల్యం నుంచి ఆసక్తి. తీరిక దొరక్కపోవడంతో ప్రస్తుతం చేయట్లేదు. రిటైరయ్యాక చేపట్టాలని ఉంది

ప్రపంచాన్ని ఎదురించిన మహా మేధావి చార్లెస్ డార్విన్. మానవ జాతి కోతి నుంచి పుట్టుకొచ్చిందని డార్విన్ చెప్పినప్పుడు.. చాలామంది అతన్ని హేళన చేశారు. మీ అమ్మగారి పూర్వీకులు కోతులా? తండ్రి వైపు వాళ్లు కోతి నుంచి వచ్చారా అని గేలి చేసేవారు. అలాంటి అవమానాల్ని ఆయన ఎన్నో భరించారు. ఇటువంటి మేధావులు నాలో కొత్త ఆలోచనల్ని రేకెత్తించేవారు.

పీజీలో ఉండగా ప్రొఫెసర్ రషీదుద్దీన్ ఖాన్ అనేక అంశాల్ని విపులంగా వివరించేవారు. ప్రపంచం విశాలమైందని.. కలెక్టర్‌గా చేయడం కన్నా.. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేయడం మేలని అనేవారు. సివిల్స్‌కి చదవకూడదన్న ఉద్దేశంతో.. తను నాకు అసైన్‌మెంట్లూ ఎక్కువగా ఇచ్చేవారు. ఒకవైపు సివిల్స్ మరోవైపు పీహెచ్‌డీ. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అనేక ఆఫర్లు వచ్చాయి. కానీ, నేను అందులో చేరితే సివిల్స్‌లో విఫలమయ్యానని తల్లిదండ్రులు భావిస్తారని.. మొక్కవోని దీక్షతో 1982లో సివిల్స్ రాశాను. రెండోసారి ఐఆర్ఏఎస్ (ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్)కి ఎంపికయ్యాను. శిక్షణ పూర్తయ్యాక.. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వేలో ప్రప్రథమ ఉద్యోగం. ఎకనామిక్స్ వల్ల రైల్వే ఫైనాన్స్‌లో మాస్టర్ అయ్యాను. విధుల్లో చేరిన నాలుగేళ్లకే బరోడా రైల్వే స్టాఫ్ కళాశాలలో పాఠాలు చెప్పే వాడ్ని. అంతెందుకు నా సీనియర్లు పాఠాలు వినేవారు. ఆ తర్వాత రైల్వే బడ్జెట్‌కి ఇన్‌ఛార్జీ అయ్యాను.

## రాజీవ్‌గాంధీ అంటే అభిమానం..

మా చిన్నాన్నకు డీజీపీ మహేందర్‌రెడ్డి పరిచయం ఉండటంతో.. ఆయన కూతురితో 1984లో పెళ్లి సెటిల్ అయ్యింది. ఆరు నెలల తర్వాత వివాహం జరిగింది. రైల్వే సర్వీసుల నుంచి భారత ప్రభుత్వంలో డైరెక్టర్, జాయింట్ సెక్రటరీగా ఎంపికైన కొద్దిమంది ఆఫీసర్లలో నేనొకడిని.

ఐటీని ఇండియాకి పరిచయం చేసిన రాజీవ్‌గాంధీ అంటే నాకెంతో అభిమానం. పీవీ నర్సింహారావు నిర్ణయాలు తీసుకోరని చాలామంది అంటుంటారు. కానీ, ఆయనెన్నో విప్లవాత్మక నిర్ణయాల్ని తీసుకున్నారని చాలామందికి అర్థం కాకపోవచ్చు. రాజకీయాలతో సంబంధం లేని మన్మోహన్‌సింగ్‌ను ఆయన ఆర్థికమంత్రి చేయగలిగారు. ఫైనాన్స్ సెక్రటరీగా మాంటెక్‌సింగ్ అహ్లువాలియాను ఎంచుకున్నారు. ఈ రెండు నిర్ణయాలు పెను సంచలనానికి దారి తీశాయి. ఎంతోమంది సీనియర్ ఐఏఎస్ అధికారులు మాంటెక్‌సింగ్ నియామకంపై అభ్యంతరాన్ని వ్యక్తపరిచారు. కానీ, పీవీ ఎవర్నీ పట్టించుకోలేదు. వీరి రాకతోనే ఆర్థిక సంస్కరణలు ఆరంభమైన విషయం తెలిసిందే. అందుకే వీరి ఆలోచనా విధానం నన్ను అమితంగా ఆకట్టుకుంది. ఇక రైల్వేలో ఉంటే మహా

అయితే జనరల్ మేనేజర్ అయ్యేవాడ్ని. అంతేతప్ప, రైల్వే వ్యవస్థను మార్చలేను కదా అని అనుకునే వాడ్ని. అప్పుడు నా ఉద్యోగం.. గుంతకల్‌లో డిప్యూటీ ఫైనాన్షియల్ అడ్వైజర్. ఇది ఒక ఐఏఎస్ ఆఫీసర్‌తో సమానస్థాయి.

## కొంకణ్ రైల్వేలో..

అప్పుడే కొంకణ్ రైల్వే పనులు ప్రారంభమయ్యాయి. ఎస్‌సీఆర్‌లో నా సామర్థ్యం గురించి తెలుసుకున్న శ్రీధరన్.. కొంకణ్ రైల్వేలో చేరమన్నారు. ఇంట్లో కూడా చెప్పకుండా చేరాను. నిజానికి అనేక సవాళ్లతో కూడుకున్న బాధ్యత అది. పైగా ఒక భారీ ప్రాజెక్టుకి పని చేయడమూ అదే మొదటిసారి. కీలక సమయాల్లో పక్కా నిర్ణయాలెలా తీసుకోవాలో.. రాజకీయ ఒత్తిళ్లను ఎలా తట్టుకోవాలో శ్రీధరన్ నుంచి నేర్చుకున్నా. కొంకణ్ రైల్వే ఆరంభమైనప్పుడు పర్యావరణవేత్తలు విరుచుకుపడ్డారు. గోవా సర్వనాశనం కానుందని పురాతన చర్చిలు, ఆలయ పెద్దలతో కలిసి గొడవ చేశారు. పత్రికల్లో పతాక శీర్షికల్లేని రోజంటూ లేదు. అయినా అధైర్యపడలేదు. ప్రతి విషయాన్ని వాళ్లకు అర్థమయ్యేలా వివరిస్తూ పనుల్ని చేపట్టాం. ఇంజినీరు, సైంటిస్ట్ అయిన రాజారాంతో కలిసి చేశాను. కొద్దిరోజులయ్యాక ఇండియన్ రైల్వేస్ నుంచి మాకు స్వేచ్ఛ లభించింది. రాజారాం నేను కలిసి ఎన్నో ప్రయోగాలు చేశాం.

## పాలమూరుకి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మల్లికార్జున్ రైల్వేమంత్రి అయ్యారు. 'తెలంగాణా అల్లుడు' అని నన్ను పిలిచేవారు. జైపాల్‌రెడ్డి కూడా అలాగే అనేవారు. ఒకరోజు మల్లికార్జున్ నన్ను కలిసి 'తెలంగాణలో మాల్గాడీలు (గూడ్స్) పోవాలా.. దీనికి గేజ్ మార్పిడి జరగాలా.. హైదరాబాద్‌కి జల్దిగా రమ్మ'ని పిలిచారు. సరే అన్నాను. మల్లికార్జున్ నన్ను దక్షిణమధ్య రైల్వేకు వెంటనే బదిలీ చేశారు. గేజ్ మార్పిడి పనులను అప్పగించారు. సికింద్రాబాద్ నుంచి అటు కర్నూలు వెళ్లాలన్నా.. ఇటు నిజామాబాద్ పోవాలన్నా మీటర్ గేజ్ ఉండేది. బ్రాడ్‌గేజ్‌గా మారిస్తే రైల్వేలకు, తెలంగాణకు కలిగే ప్రయోజనాల గురించి అధ్యయనం చేశాను. మంత్రి చెప్పింది నిజమేనని అన్పించింది. ఆర్థిక ప్రణాళికలను సిద్ధం చేశాను. మొత్తానికి తెలంగాణ, రాయలసీమలో సీనియర్ అధికారులతో కలిసి పనుల్ని చేపట్టాను. సికింద్రాబాద్/ మహబూబ్‌నగర్/ ద్రోణాచలం/గుంతకల్: సికింద్రాబాద్/ నిజామాబాద్/పర్భాని: ముదిఖేడ్/ ఆదిలాబాద్: తిరుపతి/పాకాల/కాట్పాడి: నంద్యాల/ గిద్దలూరు/ గుంటూరు.. ఇలా ఎన్నో మీటర్ గేజ్ మార్గాలను బ్రాడ్‌గేజ్‌గా మార్చాం. సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ దాకా బ్రాడ్‌గేజ్ పనులు పూర్తయిన సందర్భంగా మహబూబ్‌నగర్‌లో ఒక సభ ఏర్పాటు చేశారు. అందులో స్వాతంత్ర్య సమరయోధుడైన పాగా పుల్లారెడ్డి 'పాలమూరు అల్లుడు పాలమూరికి మాల్గాడి తెచ్చిండు' అని అనడంతో సభ చప్పట్లతో మార్మోగింది. మొత్తానికి కొన్ని వందల కిలోమీటర్లను బ్రాడ్‌గేజీగా మార్చాం. ఇందుకు గాను పీవీ నర్సింహారావు గ్రూపు అవార్డు కూడా లభించింది. 2002లో రైల్వే మినిస్టర్ అవార్డుకి ఎంపికైన ఫైనాన్స్ అధికారిని నేను. ఇది ఒక రైల్వే ఆఫీసర్‌కి అరుదైన గౌరవం. అయితే ఇంకా చాలా చేయాలనే కోరిక నాలో ఎంతో ఉండేది. కాకపోతే రైల్వే ఉన్నతాధికారుల నిష్క్రియత్వం వల్ల విసిగిపోయాను. ఇందులో నుంచి ఎలాగైనా బయటపడాలని అనుకున్నాను.

## విద్యుత్తు రంగంలో..

సరిగ్గా అదే సమయంలో మన రాష్ట్రంలో చంద్రబాబునాయుడు విద్యుత్తు రంగంలో సంస్కరణలు చేపట్టారు. అందులో డైరెక్టర్ ఫైనాన్స్ పోస్టుకి ఎంపిక జరిగింది. ప్రైస్‌వాటర్ కూపర్స్‌కి ఆ ఎంపిక బాధ్యతను అప్పగించారు. ఎంతోమంది సీఏలు దరఖాస్తు చేశారు.



యాభైమందిలో నుంచి ఎంపికైన నలుగురిలో నేను మొదటివాడ్ని. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లో చేరాను. 2002 జూన్‌లో చేరాను. అప్పటికీ రోజుకి కోటిన్నర నష్టం వచ్చేది. అంతే ఏడాదికి దాదాపు రూ.500 కోట్ల నష్టం అన్నమాట. సీఎండీ గోపాల్‌రెడ్డి నుంచి ఆదివారం పనిచేయడాన్ని నేర్చుకున్నాను. ఆయన సాంకేతిక విషయాల్ని చూసేవారు. నేను నిర్వహణ బాధ్యతల్ని చేపట్టేవాడ్ని. ఏడాది తిరగ్గానే సంస్థను లాభాల బాటలో నడిపించాం. సరిగ్గా ఈ సమయంలోనే తెలంగాణ జిల్లాల్ని పర్యటించాను.



## ఎన్వీఎస్ ఎంఎంటీఎస్

అప్పటికీ హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగింది. ఎంఎంటీఎస్ ప్రాజెక్టును ఆరంభించిన రణధీర్‌రెడ్డికి పద్మశ్రీ అవార్డు రావాలి. అతని డిప్యుటేషన్ పూర్తవ్వడంతో ఆయా బాధ్యతల్ని నిర్వహించడానికి ఒక సమర్థుడైన ఆఫీసర్ కోసం ప్రభుత్వం వెతికే సమయంలో నాపేరు ప్రస్తావనకొచ్చింది. దీంతో నన్ను జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా చేసి.. ఎంఎంటీఎస్ బాధ్యతల్ని అప్పగించారు. అప్పట్లో ఎంఎంటీఎస్ మీద ఎన్నో జోకులుండేవి. 'ఎంఎంటిఎస్ బండి అండి.. ఈగలు, దోమలు పోతాయండి.. ఎవరు ఎక్కరండి' అంటూ చాలామంది నవ్వుకునేవారు. పదివేల మందే ప్రయాణం చేస్తుండటంతో చాలామంది దీని గురించి వ్యతిరేకంగా మాట్లాడేవారు. కానీ, నేడో.. లక్షన్నర మంది ఎంఎంటీఎస్ గమ్యస్థానాలకు చేరవేస్తోంది. ఇక్కడ అందరూ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. ప్రభుత్వం ఆరంభించే ప్రాజెక్టుల్లో మొదటిరోజు నుంచే విజయవంతం అవుతాయని అనుకోవద్దు.

> అప్పటి కమిషనర్ సంజయ్ జాజుతో కలిసి 'ఫండ్ యువర్ సిటీ' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఉద్యానవనాల్ని అభివృద్ధి చేశాం. ప్రజలకు కావాల్సిన ప్రాథమిక సదుపాయాల్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాం. వీటి గురించి తెలుసుకుని ఒకరోజు ఆర్థిక కార్యదర్శి మాంటెక్‌సింగ్ అహ్లువాలియా, మరో సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన గజేంద్ర హల్దియా.. నన్ను, పురపాలకశాఖ కార్యదర్శి అయిన ఎస్పీ సింగ్‌ను పిలిపించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నగరంలో మెట్రోరైలును చేపట్టాలని సూచించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం..

2004 ఎన్నికలొచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ ఆరునెలలు వ్యవసాయం మీద దృష్టి పెట్టారు. హైదరాబాద్‌కు ఏదో ఒకటి చేయాలని అనుకునేవారు. ఒకరోజు నన్ను పిలిచి.. నగరంలో ఏం చేస్తే ఉత్తమమని అడిగారు. 'ఫ్లైఓవర్లు' అని జవాబిచ్చాను. వెంటనే నాలుగు ఆకాశ వంతెనలకు శ్రీకారం చుట్టాం. ఆయా ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని అధ్యయనం చేసి ట్రాఫిక్ ఇంజనీరు భావనారాయణతో కలిసి కొత్త రీతిలో డిజైన్లు చేశాం. నల్గొండ క్రాస్‌రోడ్స్ వద్ద.. 'సిగ్నల్ ఫ్రీ' ఉండే విధంగా ట్రంపెట్ ఆకారంలో ఫ్లైఓవర్ వేశాం. దీనిని మూసీనదిలోకి తీసుకెళుతున్నాడని.. ఇలా రకరకాలుగా నా మీద ఫిర్యాదులు చేసేవారు. అయినా నేను లెక్క చేయలేదు. పనులెక్కడా నిలిచిపోలేదు.

అప్పటి కమిషనర్ సంజయ్ జాజుతో కలిసి 'ఫండ్ యువర్ సిటీ' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఉద్యానవనాల్ని అభివృద్ధి చేశాం. ప్రజలకు కావాల్సిన ప్రాథమిక సదుపాయాల్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాం. వీటి గురించి తెలుసుకుని ఒకరోజు ఆర్థిక కార్యదర్శి మాంటెక్‌సింగ్ అహ్లువాలియా, మరో సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన గజేంద్ర హల్దియా.. నన్ను, పురపాలకశాఖ కార్యదర్శి అయిన ఎస్పీ సింగ్‌ను పిలిపించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నగరంలో మెట్రోరైలును చేపట్టాలని సూచించారు. దీంతో ఒక్కసారిగా ఆశ్చర్యపోయాం. ప్రపంచంలో ఇంత పెద్ద మెట్రో ప్రాజెక్టు పీపీపీ విధానంలో ఎక్కడా జరగలేదని వివరించాం. 'అయినా, మనదేశ ఆర్థిక అవసరాలు ముఖ్యం. పూర్తి మద్దతిస్తాం. చట్టాల్ని చేయడం పూర్తి మద్దతిస్తాం.. మీరు నిస్సందేహంగా ముందుకెళ్లండ'ని వారు అన్నారు. దీంతో రాష్ట్రానికి వచ్చిన ప్రధాన కార్యదర్శి హరినారాయణకు వివరించాం. కేంద్రం మద్దతిస్తే ఎందుకు వెనకడుగు వేస్తామని అన్నారు. తక్షణమే పదిమంది సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్లతో కలిసి మేధోమథనం జరిపేవాడ్ని. వాళ్లు అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు సిద్ధం చేసేవాడ్ని. ఇలా కొన్నాళ్ల తర్వాత హల్దియా వద్దకెళ్లాం. రాత్రంతా చర్చలు జరిగేవి. ఆయనతో వాగ్వాదం జరిగేది. సాంకేతికంగా, న్యాయపరంగా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి.. కన్సెషన్ అగ్రిమెంట్‌ను సిద్ధం చేశాం. దాదాపు ఏడాది పాటు తీవ్రంగా శ్రమించి.. ప్రపంచంలోనే ప్రప్రథమంగా పీపీపీ పద్ధతిలో చేపట్టే మెట్రోరైలు విధి విధానాల్ని రూపొందించాం. ప్రైవేటు సంస్థతో మెట్రోరైలా? అని చాలామంది వ్యతిరేకించారు. ప్రైవేటు సంస్థలతో విమానయానం చేస్తోంటే.. మెట్రోరైలును నడపడంలో తప్పేంటి? అని నా ప్రశ్న. మొత్తానికి పీపీపీ మోడల్ తయారైంది. బిడ్లు పిలిచాం. సత్యం గ్రూపునకు చెందిన మేటాస్‌కు టెండర్ దక్కింది. దేశవ్యాప్తంగా దీనిపై అందరి దృష్టిపడింది. కానీ, ఆ తర్వాత అనుకోని కారణాల వల్ల.. సత్యం కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దీంతో మెట్రోపై నీలినీడలు కమ్ముకున్నాయి. నిజానికి, నా జీవితంలో దుర్భరమైన రోజులంటే అవే. కానీ, అదే సమయంలో నా జట్టును కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. వివిధ శాఖల నుంచి ప్రతిభావంతులైన వ్యక్తులు నా వద్ద పని చేస్తున్నారు. వీరందరికీ ధైర్యాన్ని చెబుతూ.. అంతర్గతంగా మేధోమథనం జరిపాం. హల్దియా, అహ్లువాలియాలను కలిశాం. వారు మాకు ధైర్యాన్ని చెప్పారు. మొత్తానికి ఏడాది పాటు కృషి చేశాం. మళ్లీ బిడ్లను ఆహ్వానించడానికి ఆరుసార్లు వాయిదా వేశాం. రాష్ట్రం కాలిపోతుంటే.. మీకు మెట్రో అవసరమా అని కొందరు అనేవారు. కానీ, మొక్కవోని పట్టుదలతో పనుల్ని చేపట్టాం. ఎట్టకేలకు ఎల్అండ్‌టీకి మెట్రో టెండర్ వరించింది. మళ్లీ మెట్రో పనులు పట్టాలపైకెక్కింది. ఆస్తి